సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 20-1-2025

సంపుటి: 20 సంచిక: 252

పేజీలు: 4 వెల: రూ.1




## పనులు త్వరితగతిన పూర్తిచేయండి

**అధికారులకు ఎమ్మెల్యే శంకర్ ఆదేశాలు । రథసప్తమి ఏర్పాట్లు పరిశీలన**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రథసప్తమి సందర్భంగా చేస్తున్న అభివృద్ధి పనులను తొందరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం అరసవల్లి మిల్లు జంక్షన్, అరసవల్లి రోడ్డు మార్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును తెలుసుకొని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, మున్సిపల్ ఎంఈ, వన్ టౌన్ సిఐ, ట్రాఫిక్ సిఐ, వన్ టౌన్ ఎస్ఐ, టీడీపీ నాయకులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు

## భలే 'ప్లాన్' వేశావు బాసూ!





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగర కార్పొరేషన్ పరిధి మంగువారి తోటలో ప్లాన్ లేకుండా రెండేసి అంతస్తులు కడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు? నగరం మొత్తం ఇలానే ఉన్నా మంగువారితోటలో జరుగుతున్న నిర్మాణాలనే ప్రస్తావించడానికి కారణం.. గతంలో ఇదే మంగువారితోట హనుమాన్ విగ్రహం వద్ద జి ప్లస్ వన్ ఇంటిని నిర్మించుకుంటే దానికి అనుమతులు లేవని స్లాబ్‌లకు పెద్ద పెద్ద కన్నాలు పెట్టి అడ్డుకున్న ఇక్కడి వార్డు ప్లానింగ్ సెక్రటరీ షన్ముఖ తన పరిధిలో ఉన్న మంగువారితోటలో ఇప్పుడు అనేక భవనాలు ప్లాన్ లేకుండా కడుతున్నా ఎందుకు చూస్తూ ఊరుకుంటున్నారు? అది గత వైకాపా ప్రభుత్వ చేతకానితనమా? లేదూ అంటే షన్ముఖ చేతివాటమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మంగువారితోట, గూనపాలెం, దమ్మల వీధిలలో ఎవరు ప్లాన్‌కు దరఖాస్తులు చేసుకున్నా రంధ్రాన్వేషణ చేసి ఆన్‌లైన్ ద్వారా అనుమతులు రాకుండా కొర్రీలు వేస్తూ టీపీవో ఉమామహేశ్వరరావు పక్కనే కూర్చుని కంప్యూటర్ ఆపరేటర్‌గా కూడా పని చేస్తున్నట్టు కలరింగ్ ఇస్తున్న ఇదే వార్డు ప్లానింగ్ సెక్రటరీ షన్ముఖను పూర్తిగా విధుల నుంచి తొలగించాలని స్వయంగా అప్పటి రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావే తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎందుకన్నారు? ఆ తర్వాత నుంచి అనేక వార్డులకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఈ డబ్ల్యూపీఆర్ఎస్ షన్ముఖ ఎలా ఎదిగాడు? వంటి వివరాలతో కూడిన సమగ్ర కథనం

..త్వరలో





ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

బాత్రూమ్‌లో కళావతి మృతదేహం

- వ్యసనాలకు బానిసై డబ్బు కోసమే హత్య?
- పెద్దపాడు రోడ్డులో సొంత భవనాలున్నా.. న్యూకాలనీలో అద్దె ఇంటిలో శరత్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి
- టూటౌన్ పోలీసుల అదుపులో మరికొందరు అనుమానితులు



నిందితుడు శరత్


## బాత్రూమ్‌లో శవం..

# బెడ్‌రూమ్‌లో లవర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగర నడిబొడ్డు న్యూకాలనీలో పొందూరు మండలం మొదలవలసకు చెందిన పూజారి కళావతి (48) హత్య కేసులో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. న్యూకాలనీలో అద్దెకుంటున్న అండలూరి శరత్‌కుమార్ (34) స్థానిక సరస్వతి థియేటర్ పక్కన జనరేటర్ మెకానిక్ వర్క్స్‌తో పాటు సెకండ్ హ్యాండ్ జనరేటర్లు అమ్మడం, అద్దెలకు ఇచ్చే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. చెడు సావాసాలు, మద్యంకు బానిసైన శరత్‌కుమార్ తండ్రి వెంకట్రావు ఆస్తిపరుడైనా కుమారుడ్ని భరించలేక బయటకు నెట్టేశారు. దీంతో ఏడాదిన్నరగా న్యూకాలనీలోనే శరత్‌కుమార్ అద్దెకుంటున్నాడు. మొదలవలస గ్రామానికి చెందిన వివాహిత కళావతితో వివాహేతర సంబంధం ఉందని శరత్ మిత్రులు చెబుతున్నారు. ఇందులో భాగంగానే శనివారం కళావతిని ఫోన్ చేసి పిలిపించుకున్నాడని తెలుస్తుంది. గతంలో అనేకమార్లు శరత్ రూమ్‌కు కళావతి వచ్చినట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. గత కొంతకాలంగా వ్యాపారం సరిగ్గా నిర్వహించక వ్యసనాలకు బానిసైన శరత్ అప్పులపాలైపోయాడు. దీంతో కనపడినచోటల్లా వడ్డీలకు అప్పులు చేసి షాపు కూడా సరిగ్గా తెరవకుండా విలాసాల్లో తేలియాడేవాడని తెలుస్తుంది. శనివారం కూడా ఫుల్‌గా మద్యం సేవించిన తర్వాత కళావతికి ఫోన్ చేసి రప్పించుకొని తన బాకీలు తీర్చుకోడానికి పనికొస్తుందని ఆమె వద్ద ఉన్న నగలు కాజేయడానికి హత్య చేసినట్లు తెలుస్తుంది. శనివారం రాత్రి కళావతిని హత్య చేసి బాత్రూమ్‌లో పడేసిన తర్వాత శరత్ గర్ల్‌ఫ్రెండ్‌కు ఫోన్ చేసి బెడ్‌రూమ్‌లో శనివారం ఉదయం 4 వరకు కులికినట్లు తెలుస్తుంది. ఈ విషయం బెడ్‌రూమ్‌లో ఉన్న మహిళకు తెలుసా? లేదా? అన్నకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం శరత్ బాత్రూమ్‌లో శవాన్ని ఉంచి, తన ఫ్రెండ్ నరేంద్ర వద్దకు వెళ్లి గతంలో

- మిగతా 4లో






## ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి చర్యలు

- ప్రసిద్ధిగాంచిన విద్యానిలయం ఆర్ట్స్ కళాశాల
- అత్యుత్తమ విద్యాకేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి
- శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎంతో చరిత్ర కలిగిన శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలను మరింత ఉన్నత విద్యాసంస్థగా తీర్చిదిద్ది, ఉత్తమ ప్రమాణాలతో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ కళాశాల) సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. త్వరలో జాతీయ విద్యా ప్రమాణాల కమిటీ సందర్శన నేపథ్యంలో ఉత్తమవిద్యాప్రమాణాల కేంద్రంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలను గుర్తించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యాలయ ప్రాంగణంలో ఉండేవిధంగా అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.సురేఖ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, టీడీపీ కార్యకర్తలు తోణంగి వెంకన్నయాదవ్, రొక్కం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## అచ్చెన్న చొరవతో..

# రబీకి నీరు విడుదల



- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతాంగం
- సంక్రాంతి వేల మంత్రికి వినతి ఇచ్చిన రైతులు
- ఉన్న నీరును వినియోగించుకునేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశం
- ఆరుతడి పంటలకు నీరు ఇచ్చిన కూటమి సర్కారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రబీ సీజన్లో ఆరుతడి పంటలకు నీరు అందించే విధంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీసుకున్న చొరవ సత్ఫలితాలు ఇస్తోంది. మొన్నటి సంక్రాంతి వేళ తనను కలిసిన రైతులు చేసిన విన్నపానికి మంత్రి అచ్చెన్నాయుడు వెనువెంటనే స్పందించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. వంశధార ఇంజినీరింగ్ అధికారులతోనూ, కలెక్టర్‌తోనూ ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం వంశధారలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి నిల్వలను సద్వినియోగం చేసుకునేలా రైతాంగం చర్యలు చేపట్టాలని, సాగు అవసరాలను నీటి లభ్యతకు అనుగుణంగా తీర్చుకోవాలని సూచిస్తూ దిశానిర్దేశం చేశారు. తాజాగా జిల్లా వ్యాప్తంగా 7వేల ఎకరాలకు పైగా పంట పొలాలకు నీరందుతోంది. ఇందుకు మంత్రి అచ్చెన్నాయుడు తీసుకున్న చర్యలే కారణంగా నిలిచాయని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. రబీలో సాగవుతున్న వరి, వేరుశనగ, రాగులు, పెసర, మినప, నువ్వు, మొక్కజొన్న పంటలకు మేలు జరిగిందని వీరంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా మొక్కజొన్న సాగు ఈ సీజన్‌లో ఉంది. ఇదే సాగు లాభసాటిగా ఉండడంతో రైతులంతా ఎక్కువగా మొక్కజొన్నపై మొగ్గుచూపారు. సమయానికి నీరు రావడంతో వీరంతా సంతోషంగా మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు చెబుతున్నారు.

# మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం

- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



న్యాయ వివాదాలను త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ఒక ప్రభావవంతమైన మార్గమని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం అనే అంశంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజులు, 40 గంటల శిక్షణ కార్యక్రమం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రారంభమైంది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అధ్యక్షతన, జిల్లావ్యాప్తంగా వివిధ బార్ అసోసియేషన్ల నుంచి ఎంపిక చేసిన పలువురు న్యాయవాదులు ఈ శిక్షణకు హాజరయ్యారు. శిక్షణలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను ఎలా పరిష్కరించాలి, దాని ప్రయోజనాలు, సవాళ్లు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసుల సత్వరపరిష్కారానికి శిక్షణలు తోడ్పాటు అందిస్తాయని చెప్పారు. న్యాయవాదులు ఈ మధ్యవర్తిత్వ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం నేర్చుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు మీడియేషన్, కన్సీలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) సభ్యులు అనూజా సక్సేనా, వీణా రల్లి మాస్టర్ శిక్షకులుగా వ్యవహరిస్తారు. ఈ నెల 24 వరకు కొనసాగే ఈ శిక్షణ తర్వాత న్యాయవాదులు మధ్యవర్తిత్వ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని జిల్లా జడ్జి ఆశాభావం వ్యక్తం చేశారు.

• ఎడిటోరియల్

## అంత కాస్ట్లీ గిఫ్ట్ అవసరమా?

అమెరికా మొదటి మహిళ జిల్ బిడెన్‌కు ప్రధాని మోదీ బహుమతిగా ఇచ్చిన వజ్రం ధర 20వేల డాలర్లు. అంటే మన రూపాయి విలువలో లెక్కిస్తే రూ.17.14 లక్షలు. మన దేశ పౌరులు చెల్లించిన పన్నుల నుంచి వచ్చిన 20వేల డాలర్లతో ఇక్కడ, భారతదేశంలో ఏ విధంగా ఎన్ని పనులకు ఖర్చుపెట్టవచ్చో, ఎంతమందికి ఉపయోగపడేలా ఖర్చుపెట్టవచ్చో తెలుసా? వివిధ సందర్భాల్లో విదేశీ ప్రముఖులకు ప్రధాని ఇచ్చిన కానుకల ధరను వెల్లడించడానికి ప్రభుత్వం విముఖత వ్యక్తం చేసినప్పటికీ, 2023లో అమెరికా ప్రథమ మహిళ జిల్ బిడెన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ బహుమతిగా ఇచ్చిన వజ్రం విలువ సుమారు 20వేల డాలర్లు ఉంటుందని వాషింగ్టన్ వెల్లడించింది. 2023 జనవరి 7 నాటికీ డాలర్‌తో రూపాయి విలువ 85.7గా ఉంది. మోదీ బహుమతిగా ఇచ్చిన 7.5 క్యారెట్ల వజ్రం విలువ రూ.17.14 లక్షలు. ఇది తక్కువేమీ కాదు. వాస్తవానికి అమెరికా అధ్యక్షుడి కార్యాలయం వెల్లడించిన సమాచారం ప్రకారం, 2023లో విదేశీ ప్రముఖుల నుంచి బిడెన్ దంపతులు అందుకున్న బహుమతులలో ఇదే అత్యంత ఖరీదైన బహుమతి. రూ. 17.14 లక్షలను భారతదేశంలో అయితే ఏఏ అవసరాలకు ఖర్చు చేయచ్చో చూద్దాం. నలుగురు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 12 నెలల జీతం. టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో తయారుచేసిన నివేదిక ప్రకారం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నెలకు పొందే సగటు జీతం రూ.31,255. ఈ లెక్కన చూస్తే, రూ.17.14 లక్షలతో నలుగురు ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి 12 నెలలకు వేతనాలు చెల్లించవచ్చు. 2021-22 లెక్కల ప్రకారం భారతదేశంలోని 21 ప్రధాన రాష్ట్రాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో దాదాపు 14.7 శాతం పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలేనని 'ది హిందూ' కథనం వెల్లడించింది. ఈ రాష్ట్రాలలో, అటువంటి ప్రతి పాఠశాలలో సగటున 33 మంది విద్యార్థులు ఉన్నారు. బీహార్‌లో సగటున 96 మంది వరకు ఉండవచ్చు. అటువంటి పాఠశాలల్లో అదనంగా మరొక ఉపాధ్యాయుణ్ణి నియమించినట్లయితే ఎంతోమంది పిల్లల జీవితాల్లో కచ్చితంగా మార్పు తీసుకురాగలరు. ఇటీవల సవరించిన ప్రభుత్వ అంచనాల ప్రకారం, చాలా రాష్ట్రాలతోపాటు ఢిల్లీ, పుదుచ్చేరిలో బాల వాటికా, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం సరుకుల కోసం ఒక పిల్లవాడికి రోజుకు రూ.6.19 చొప్పున కేటాయిస్తారు. 7.5 క్యారెట్ వజ్రం వ్యయంతో ఈ విద్యార్థులకు 2,76,898 మధ్యాహ్న భోజనాలను అందించవచ్చు. గత నెలలో టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రచురించబడిన నివేదిక ప్రకారం ఢిల్లీ, గోవా, కొన్ని ఈశాన్య రాష్ట్రాల్లో పాఠశాలల్లో వంటమనిషి, హెల్పర్‌లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల పని చేస్తారు. వారికి నెలకు కేవలం వెయ్యి రూపాయలు గౌరవ వేతనం చెల్లిస్తారు. కొన్ని ఇతర రాష్ట్రాలలో ఇందుకు భిన్నంగా, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంపై ఆధారపడి గౌరవ వేతనం రూ. 12వేల వరకు ఉంటుంది. ఈ సమాచారం సరైనదైతే.. అటువంటి 342 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.17.14 లక్షలు, ఒకసారి రూ.5వేలు బోనస్ ఇవ్వడానికి తోడ్పడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ పథకం అమలుకు ఎంపిక చేయబడిన లబ్ధిదారుల ఇళ్లలో 'వ్యక్తిగత మరుగుదొడ్ల' నిర్మాణానికి 142 ఇళ్లకు మంజూరు చేయటానికి అవసరమైన ఖర్చును రూ.17.14 లక్షలు ద్వారా భరించవచ్చు. ఒక గ్రామీణ కుటుంబంలో ఇద్దరు పని చేసే సభ్యులు ఉన్నారని, వారికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం సంవత్సరానికి 100 రోజుల పని దొరుకుతుందని భావించినట్లయితే, ప్రతి వ్యక్తికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు సగటు వేతనం రోజుకు రూ. 249.67 అవుతుంది. అంటే రూ. 17.14 లక్షలతో అలాంటి 34 కుటుంబాలకు 100 రోజుల ఉపాధి కల్పించవచ్చు. మాన్యువల్ స్కావెంజర్‌గా గుర్తించబడిన 42 కుటుంబాలు మాన్యువల్ స్కావెంజర్‌ల పునరావాసం కోసం స్వయం ఉపాధి పథకం కింద ప్రభుత్వం మాన్యువల్ స్కావెంజర్‌గా గుర్తించబడిన కుటుంబానికి పరిహారంగా రూ.40వేలు అందిస్తుంది. రూ.17.14 లక్షలతో 42 కుటుంబాలకు ఈ పరిహారం అందజేయవచ్చు. 2023లో మణిపూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలో మరణించిన వారి కుటుంబానికి / బంధువులకు రూ.10లక్షల పరిహారం అందజేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. రూ.17.14 లక్షలతో ఒక బాధితురాలి బంధువులకు పూర్తి పరిహారం చెల్లించవచ్చు. ప్రధాన్ మంత్రి పట్టణ ప్రాంత ఆవాస్ యోజన 'లబ్ధిదారుల నాయకత్వంలో వ్యక్తిగత గృహ నిర్మాణం లేదా మెరుగుదల' పథకం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు రూ. 2.5 లక్షల వరకు రాయితీపై ఇళ్లను కేటాయించటానికి ఉద్దేశించబడింది. మొత్తం రూ. 17.14 లక్షలతో ఈ పథకం కింద ఆరు ఇళ్లకు సబ్సిడీల ఖర్చును భరించవచ్చు.



# కుంభమేళా ఖర్చు రూ.2లక్షల కోట్లు పైమాటే!

కుంభమేళా ఎప్పటినుండో జరుగుతూ ఉండచ్చుగాక. కానీ ఈసారి కుంభమేళా ఎంత పెద్దదో దానికే తెలియడం లేదు. ఆధ్యాత్మిక విషయా లను కాసేపు పక్కన పెడదాం. కేవలం హోర్డింగ్స్, ఎల్ఈడి స్క్రీన్లు, టీవీ, రేడియో, పత్రికలు, డిజిటల్ ప్రకటన సంస్థలకు వ్యాపార అవకాశాల అంచనా యాభై వేల కోట్లకు పైమాటే. మొత్తం 45రోజుల్లో దాదాపు 45 కోట్లమంది వస్తారని అంచనా. ఒక్కో మనిషికి హీనపక్షం అయిదువేల రూపాయల ఖర్చవుతుందనుకున్నా ఇదో రెండు లక్షల కోట్ల అంచనా. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పెట్టిన, పెడుతున్న ఖర్చు కూడా వేల కోట్లలోనే ఉంది. భూగోళం మీదే అతిపెద్ద ఆధ్యాత్మిక జనజాతరగా కుంభమేళా ప్రత్యేకతలు లెక్కలేనన్ని. మన చర్చ ఆధ్యాత్మిక విషయాలగురించి కాదు కాబట్టి వసతులు ఇతర విషయాల్లో ఈసారి వచ్చిన మార్పులేమిటో చూద్దాం.





లక్షల, కోట్ల మంది పోగయ్యే చోట తమ వస్తువుల ప్రకటనలు ఉండాలని కార్పొరేట్ కంపెనీలు కోరుకోవడం సహజం. కాకపోతే ఇదివరకు ఆధ్యాత్మిక కార్యక్రమాల దగ్గర వాణిజ్య ప్రకటనల హోరు ఉండేది కాదు. క్రమంగా పెరుగుతోంది. కుంభమేళా దగ్గర అది హిమాలయాలను తాకింది. ఉచితంగా దొరికే తాత్కాలిక డేరాల మొదలు రోజుకు 50 వేల రూపాయలకు దొరికే అత్యాధునిక సకల సదుపాయాల తాత్కాలిక గుడారాల దాకా అన్నీ అందుబాటులో ఉన్నాయి. పిండి కొద్దీ రొట్టె- భక్తి కొద్దీ దైవం- ఖర్చు కొద్దీ స్నానం అనుకోవాలి. తాత్కాలిక స్తంభాలమీద హోర్డింగ్స్, రోడ్ల మధ్యలో లాలీ పాప్స్, పక్కన బిల్ బోర్డ్స్, పబ్లిక్ సౌండ్ సిస్టమ్‌లో ప్రకటనలు, ఎల్ఈడి తెరలమీద ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇవన్నీ తెలిసినవే. పడవల చుట్టూ, మంచి నీళ్ళ బాటిళ్ళమీద, గుడారాల టార్పాలిన్ బట్ట మీద, విచారణ కౌంటర్ల దగ్గం, బాత్ రూమ్ గోడల మీద, పోలీస్ పోస్టుల చుట్టూ ఇలా అది ఇది అని లేదు. కుంభమేళాలో ప్రకటనలు కనపడని చోటు లేదు. స్థానిక ఉత్పత్తులు మొదలు కోకోకోలా లాంటి బహుళ జాతి కంపెనీల దాకా అన్ని ఉత్పత్తుల ప్రకటనలు కనిపిస్తున్నాయి. ఎక్కడెక్కడ ప్రకటనలకు ఎంతెంత ధరో నిర్ణయించి గంపగుత్తగా వివిధ ఏజెన్సీలకు, ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థలకు ప్రభుత్వమే అమ్మినట్లుంది. దానిమీద లాభం కలుపుకుని ఆయా సంస్థలు కంపెనీలకు స్పేస్ ఇచ్చినట్లున్నాయి. ప్రధానమైన కూడళ్ళలో ఒక పెద్ద ప్రకటన హోర్డింగ్ పెట్టుకోవడానికి 45 రోజులకు కోటి రూపాయలు వసూలు చేసేవి కూడా ఉన్నాయి. కంపెనీలు కూడా తెలివిగా స్నానాల దగ్గర సోపులు, షాంపూలు, టీ కాఫీల దగ్గర టీ కాఫీ పొడుల ప్రకటనలను పెట్టాయి.

**కొస మెరుపు:-**

ప్రపంచంలో ఎక్కడ ఏమి జరిగినా తెలుగువారి ప్రమేయం ఉండే రోజులివి. సినిమా కార్యక్రమాలను నిర్వహించే హైదరాబాద్ ఈవెంట్ మేనేజ్మెంట్ మీడియా సంస్థ కుంభమేళా ప్రకటన హక్కులను గంపగుత్తగా దక్కించుకున్నట్లు వార్త.


-పమిడికాల్వ మధుసూదన్




ఈమె ఎవరో తెలుసా? అని పొద్దున్నుంచి ఆ టీవీ వాడు నన్ను తెగ గోకుతున్నాడు. ఎటు చూసినా ఈ అమ్మాయి వీడియోలే కనిపిస్తున్నాయి. సరే అని చూద్దును గదా, ఏమో ఈ అమ్మాయి ఎవరో నాకేం తెలుసు ? కానీ ఒక్కటి మాత్రం నాకు తెలిసింది. గత కొద్దిరోజులుగా ప్రయాగ్ రాజ్ కుంభమేళా సాధువుల ఫోటోలతో హోరెత్తిస్తున్న సోషల్ మీడియాని ఒకే ఒక్క నవ్వుతో తనవైపుకు తిప్పుకుంది ఈ అమ్మాయి ప్రస్తుతం ఈ అమ్మాయి పిక్ వైరల్ చేసి చాలామంది వైరల్ ఫీవర్లు తెచ్చుకుంటున్నారు, అసలు సంగతేంటా అని ఆరా తీస్తే.. ఈ అమ్మాయి కుంభమేళాలో పూసలు అమ్ముతూ ఒక కళా పురుష్ కళ్లలో పడిందట, అంతే, ఆత్రం ఆపుకోలేని కళాపురుష్ పిల్ల ఫోటో ట్విట్టర్లో వదిలాడట. దాంతో పిల్ల ఫోటో వైరల్ అయి దేశమంతా ఈవిడ పుట్టుపూర్వోత్తరాల కోసం గూగులమ్మని తెగ గోకేస్తున్నారట. ఒకరేమో మోనాలిసా అనీ ఇంకొకరేమో రేఖ చెల్లెలనీ రకరకాల డిస్కసన్సు.. డిస్కవరీలు చేసేస్తున్నారు. ఇంతకీ ఈ పిల్ల దగ్గర నేను ఇంతవరకు పూసలు కొనలేదు గాబట్టి ఈ అమ్మాయి ఎవరో నాకూ తెలీదు గానీ కానీ ఒకటి మాత్రం తెలుసు, పిల్ల బావుంది, అందులో అనుమానమే లేదు. ప్రత్యేకించి ఆ కళ్లు!

- పరేష్ తుర్లపాటి



# పూసలమ్మే ఆ కళ్లు.. సోషల్ మీడియాను పడేశాయి!



మనోళ్లు ఏ బాలయ్య పక్కనో సినిమాల్లోకి లాగేస్తారు చూస్తుండండి (అన్నట్టు బాలయ్య అఖండ 2 షూటింగు ఇప్పుడు కుంభమేళా పరిసర ప్రాంతాలలోనే జరుగుతుందట).. అమ్మాయి గోరూ.. చూస్తుండండి.. ఏదో రోజు మీరు సినిమాల్లోకి వచ్చేస్తారు.. వచ్చేస్తారు.. అమ్మాయి గారూ.. (జోకనుకునేరు.. నిజంగానే అంటున్నా) ఇప్పుడు సాంగ్: పూసలోల్లమే పిల్లా మేమూ పూసలొల్లమే (ఇది సరదాగా)...

ఈమె పేరు మోనాలిసా కాదు.. మోనీ భోస్లే.. మధ్యప్రదేశ్.. పెద్దగా చదువుకోలేదు, కుటుంబానికి ఆసరాగా నిలబడటానికి రుద్రాక్ష, పూసలు, ముత్యాల దండలు అమ్ముతూ ఉంటుంది. తమ్ముడిని తనే చదివిస్తోంది. బాగా యాక్టివ్.. సోషల్ మీడియాలో వైరల్ కావడమే కాదు, సోషల్ మీడయాలో యాక్టివ్ కూడా.. సొంతంగా ఓ ఇన్స్టా అకౌంట్ ఉంది. పాతిక వేల దాకా ఫాలోవర్స్.. ఇదీ ఆమె ఖాతా

https://www.instagram.com/monibhosle8/?hl=en

త్వరలో యూట్యూబ్ చానెల్ కూడా పెడుతుందట, ఏదో యూట్యూబర్ ఇంటర్వ్యూలో చెబుతోంది. సపోర్ట్ చేయండి అంటోంది. అంతేకాదు, తన దగ్గర ముత్యాల దండలు కొని ధరిస్తే బీపీ, సుగర్ కంట్రోల్‌లో ఉంటాయంటోంది. మార్కెటింగ్ తెలివి ఉంది.

దండలు వేసుకుంటే బీపీలు తగ్గడమే మిటమ్మా అంటే ఇవి ఒరిజినల్ ముత్యాలు.. కన్యాకుమారి, రామేశ్వరం ఏరియాల నుంచి కొనుక్కొస్తాం, ఆర్టిఫిషియల్ కాదు, ధరిస్తే ఆ ఫాయిదా ఉంటుందీ అంటోంది..తెలివైందే!!

హఠాత్తుగా వైరల్ అయ్యేసరికి ఎక్కడికి పోయినా జనం చుట్టుముడుతున్నారు. దాంతో కొన్నిసార్లు టెంట్ నుంచి బయటికి రావడం లేదట, ఆమె కజిన్ చెబుతోంది. కొన్నిసార్లు మాస్క్ వేసుకుని అమ్ముతోందట. మనవాళ్లకు ఎప్పుడూ కొత్తగా ఎవరో ఒకరు కావాలి, ఇక సోషల్ మీడియాను మొత్తం వాళ్ల చుట్టూ తిప్పుతారు. ఇప్పుడు ఈమె వంతు!

అన్నట్టు.. ప్రసిద్ధ మోనాలిసా చిరునవ్వు (?) ఓ మార్మిక రహస్యం. ఈ పూసల మోనాలిసా కళ్లు తేటగా నవ్వుతున్నాయి. ఎవరి అందం వాళ్లదే!!

## చరణ్-కియారా ఎందుకిలా జరుగుతోంది!



రామ్‌చరణ్- కియారా అద్వాణీ కాంబినేషన్ ఎందుకనో వర్కౌట్ అవ్వడం లేదు. ఇటీవల రిలీజ్ అయిన గేమ్‌ఛేంజర్ ఎలాంటి ఫలితాలు సాధించిందో తెలిసిందే. శంకర్ దర్శకత్వం వహించిన సినిమా భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా ఫలితం ఊహించని విధంగా వచ్చింది. అంతకు ముందు చరణ్-కియారా వినయ విధేయ రామ లోనూ కలిసి నటించారు. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఈ సినిమా కూడా భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా ఫలితం తేడా కొట్టేసింది. అలా చరణ్-కియారా కలిసి నటించిన రెండు సినిమాలు కూడా డిజాస్టర్లగానే నమోదయ్యాయి. దీంతో ఇద్దరి కాంబినేషన్‌ని ఇకపై రిపీట్ చేయకపోవడమే మంచిదనే విమర్శ వ్యక్తమవుతోంది. వాస్తవానికి శంకర్ గేమ్ ఛేంజర్‌కి ఎంపిక చేసినప్పుడే ఇదోక బ్యాడ్ ఇండికేషన్‌గా నెట్టింట వైరల్ అయింది. వినయ విధేయ రామతో ఫ్లాప్ కాంబినేషన్ అనే ముద్ర పడింది. అయినా శంకర్ పట్టుబట్టి మరీ కియారాని ఎంపిక చేసాడు. దీంతో మెగా అభిమానుల నుంచి కొంత అసంతృప్తి వ్యక్తమైంది. అయినా శంకర్ వాటన్నింటి లైట్ తీసుకుని ముందు కెళ్లారు. కట్ చేస్తే ఫలితం తారుమారైంది. ఇక ఫ్లాప్‌కి కర్ణుడి చావు తరహా కారణాలెన్నో తెరపైకి వస్తున్నాయి. అయినా ఇదంతా గతం. గతాన్ని తవ్వినా ఎలాంటి ఫలితం ఉండదు. కానీ అనుభవం నుంచి ఏం నేర్చుకున్నాం అన్నది ముఖ్యమైంది. మరి ఈ ఫ్లాప్ శంకర్‌లో ఎలాంటి పరివర్తన తీసుకొస్తుందో చూడాలి. కియారా టాలీవుడ్‌లో భరత్ అనే నేను సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. అందులో సూపర్ స్టార్ మహేష్ కి జోడీగా నటించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయింది. సినిమాలో కియారా చాలా బలమైన పాత్ర పోషించింది. తొలి సినిమాలోనే నటనకు ఆస్కారం ఉన్న రోల్ దక్కింది. నటిగా విమర్శకుల ప్రశంసలందుకుంది. కానీ తర్వాత నటించిన రెండు తెలుగు సినిమాలు మాత్రం తీవ్ర నిరాశనే మిగిల్చాయి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## శ్రీలీల- మీనాక్షిల కుర్చీలాట



నాగచైతన్య 'తండేల్'తో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల అవుతుంది. ఆ తరవాత కార్తీక్ దండు సినిమాని పట్టాలెక్కిస్తాడు. 'విరూపాక్ష' సినిమాతో ఆకట్టుకొన్నాడు కార్తీక్ దండు. ఈసారి కూడా ఓ మిథికల్ థ్రిల్లర్‌ని రూపొందిస్తున్నాడు. కథానాయికగా మీనాక్షి చౌదరిని ఎంచుకొన్నారు. అయితే..ఆ తరవాత ఈ స్థానంలో శ్రీలీల వచ్చి చేరింది. మీనాక్షి చౌదరి, నాగచైతన్య కాంబో ఫ్రెష్‌గా ఉంటుందని ఆమెని తీసుకోవాలనుకొన్నారు. అయితే పారితోషికం విషయంలో కాస్త పేచీ వచ్చిందని పక్కన పెట్టారు. ఆ తరవాత శ్రీలీలని అనుకొన్నారు. కార్తీక్ దండు సుకుమార్ శిష్యుడన్న సంగతి తెలిసిందే. విరూపాక్ష సినిమాలో సుకుమార్ హ్యాండ్ వుంది. ఆయన వాటాదారు కూడా. ఈ సినిమా విషయంలోనూ సుక్కు జోక్యం చేసుకొంటున్నారే. 'పుష్ప 2' కోసం శ్రీలీల ఓ ప్రత్యేక గీతం చేసింది. అప్పుడే చైతూ పక్కన శ్రీలీల అయితే బాగుంటుందని సుకుమార్ సలహా ఇచ్చార్ట. దాంతో మీనాక్షిని పక్కన పెట్టి, శ్రీలీలని తీసుకొన్నారు. అయితే ఇప్పుడు శ్రీలీల డేట్లు కాస్త డైలామాలో పడ్డాయి. అఖిల్ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఆ సినిమా డేట్లతో చైతూ డుట్లు క్లాష్‌లో పడ్డాయట. దాంతో.. శ్రీలీలని పక్కన పెట్టి మళ్లీ మీనాక్షినే తీసుకొందామని ఆలోచిస్తున్నారు. కాకపోతే.. రెమ్యునరేషన్ విషయంలో మీనాక్షి కాస్త తగ్గాల్సివుంటుంది. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్టు తరవాత మీనాక్షి తన రెమ్యునరేషన్ పెంచేసిందని తెలుస్తోంది. ఈ విషయంలో నిర్మాత.. హీరోయిన్.. ఇద్దరిలో ఎవరో ఒకరు తగ్గాల్సివుంటుంది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..

# ట్విట్టర్ అధినేత దృతరాష్ట్ర కౌగిలిలోకి భారత్!



**అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్‌కు సన్నిహితుడు, ప్రపంచ సాంకేతిక కుబేరుడు, వివాదాస్పద రాజకీయ నాయకులకు మద్దతు ఇస్తూనే ఉంటాడు. ప్రపంచంలో జరిగే ఎన్నికలపై ఆయనకున్న ఆసక్తి అంతా ఆయన వ్యాపార ప్రయోజనాల కోసమేనని ఒక విహంగావలోకనం స్పష్టం చేస్తోంది. జర్మనీ మితవాద పార్టీ 'ఆల్టర్ నేటివ్ ఫుర్ డియుట్స్ చ్ లాండ్'(ఏఎఫ్ డీ)ని ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ కీర్తిస్తూ, దాని చాన్స్ లర్ అభ్యర్థి ఎలైస్ వీడెల్ తో ఇటీవల సంభాషించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో ప్రపంచ రాజకీయాలను ఆయన ప్రభావితం చేయడం పున:ప్రారంభించారని ప్రపంచ వ్యాప్తంగా భావిస్తున్నారు.**

మరో నెల రోజుల్లో జర్మనీలో ఫెడరల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో "ఆల్టర్ నేటివ్ ఫుర్ డియుట్స్ చ్ లాండ్'(ఏఎఫ్ డీ) మాత్రమే జర్మనీని రక్షించగలదు" అని తన సొంత వేదిక 'ఎక్స్' నుంచి మస్క్ ప్రకటించారు. ఎలైస్ వీడెల్‌తో మాట్లాడుతున్నప్పుడు దీన్ని మరింత బలపడేలా చేస్తామని చెప్పడమే కాక, నాజీ పార్టీ నుంచి వలసలవరకు, మాట్లాడే స్వేచ్ఛ నుంచి 'భగవంతుడి ఉనికి' వరకు చర్చించారు.

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ కు సన్నిహితుడు, ప్రపంచ సాంకేతిక కుబేరుడు, వివాదాస్పద రాజకీయ నాయకులకు మద్దతు ఇస్తూనే ఉంటాడు. ప్రపంచంలో జరిగే ఎన్నికలపై ఆయనకున్న ఆసక్తి అంతా ఆయన వ్యాపార ప్రయోజనాల కోసమేనని ఆయనపైన చేసిన విహంగావలోకనంలో స్పష్టమవుతోంది. "ప్రభుత్వం అతిగా క్రమబద్ధీకరించడం, తక్కువ పన్నులు, మార్కెట్‌ను పున: క్రమబద్ధీకరణ చేయకుండా ఉండడం" అనే ఏఎఫ్ డీ పథకాలను కీర్తిస్తూ జర్మనీ లో ప్రసిద్ధ వార్తా ప్రతిక 'డై వెల్ట్' లో మస్క్ ఒక కథనం రాశాడు. ఒక వేళ ఏఎఫ్‌డీ అధికారంలోకి వస్తే ప్రత్యక్షంగా ఈ ఆర్థిక విధానాలకు ప్రయోజనం కలిగించే విధంగా బ్రాండెన్ బర్గ్ లో టెస్లా ప్లాంట్‌ను నెలకొల్పాడు.

బాహాటంగా ఒక రాజకీయ పార్టీకి కానీ, ఒక అభ్యర్థికి కానీ మస్క్ మద్దతు తెలపడం ఇది కొత్త కాదు. కాస్త వెనక్కి వెళ్ళినట్టయితే, 2022లో ట్విట్టర్ ను సొంతం చేసుకున్నాక, స్వేచ్ఛగా మాట్లాడాలనే తన ఆలోచనకు అనుగుణంగా, ఎన్నికల అనంతరం ట్రంప్ లెక్కలను పునరుద్ధరించాడు. అప్పటి నుంచి ప్రతి ప్రచారంలో ట్రంప్ ను మస్క్ కీర్తించడమే కాకుండా, అవకాశం దొరికినప్పుడల్లా నిష్క్రమిస్తున్న బైడెన్ పరిపాలనను దుమ్మెత్తి పోశాడు.

ఇటీవల జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఎన్నికల ప్రచారానికి పావు బిలియన్ డాలర్లను విరాళంగా ఇచ్చాడు. రిపబ్లికన్ నాయకుడిని ప్రోత్సహించడాన్ని కొనసాగిస్తూ,- అంచెలంచెలుగా చేసే 'ఎక్స్' సహాయంతో అందరికంటే మస్క్ ను పైకెత్తడం వల్ల- ట్రంప్ కు కుడి భుజంలా తయారు కానున్నాడు. ట్రంప్ గెలిచినట్టు ప్రకటన వెలువడగానే "ఒక నక్షత్రం మొదలైంది-ఎలన్" అని ఆయన ప్రకటించాడు. ట్విట్టర్‌ను ఎలెన్ స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి అదొక విధ్వంసంగా తయారైంది. ట్రంప్ మళ్ళీ ఎన్నికైనప్పటి నుంచి ట్విట్టర్ విలువ 80 శాతం పడిపోగా, లాభాలు రెట్టింపయ్యాయని ఒక అంచనా.

ఓహియో కేంద్రంగా ఉండే పెట్టుబడి దారుడు, మరో మితవాద నాయకుడు వివేక్ రమణ స్వామితో పాటు, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రతిభా విభాగం(డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ)కు అధిపతిగా అధ్యక్షుడి చేత ఎంపికవ్వాలనుకుంటున్నాడు. అమెరికా ఎన్నికల్లో విజయాలు రుజువవడంతో తన వ్యూహాన్ని ప్రపంచ వ్యాప్తం చేయడానికి దోహదం చేస్తాయి.

### బ్రిటన్ పై దృష్టి

మస్క్‌కు బ్రిటన్‌లో కూడా ప్రయోజనాలున్నాయి. బ్రిటన్ లో జరగనున్న ఎన్నికలకు ముందే స్టార్ మర్‌ను అస్థిరపరిచడానికి మస్క్ పరిశీలిస్తున్నాడని 'ద ఫైనాన్స్ టైమ్స్' రాసింది. బ్రిటన్ లో మరొక మితవాద ప్రసిద్ధ 'రిఫార్మ్ యూకె' అనే పార్టీకి మద్దతివ్వడానికి ప్రయత్నిస్తున్నాడని ఆ పత్రిక పేర్కొంది. 'రిఫార్మ్ యూకె' పార్టీ నాయకుడు నైజెల్ ఫరాగె 2024 జూన్ లో అప్ లోడ్ చేసిన వీడియోకు మస్క్ సమాధానంగా "మితవాదానికి దూరంగా ఉన్నారని మీడియా మిమ్మల్ని ఎందుకంటోంది?" అని అడిగితే, "ఎందుకంటే, కుటుంబ వ్యవస్థను, దేశాన్ని, బలమైన సరిహద్దులు ఉండాలని మేం కోరుతున్నాం కనుక." అని పరాగె చెప్పారు. తరువాత డిసెంబర్‌లో, ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసం మార్- ఆ- లాగో లో పార్టీ కోశాధికారి నిక్ క్యాండి తో మస్క్ ఉన్న ఫొటోలో కనిపించాడు. ఈ కుబేరుడు వంద మిలియన్ డాలర్లను 'రిఫార్మ్ యూకె' పార్టీకి విరాళంగా ఇవ్వనున్నట్టు పుకార్లు షికారు చేశాయి. ఏది ఏమైనప్పటికీ , ఇటీవల కాలంలో మస్క్ ఫరాగెకి దూరమయ్యాడు. వారిద్దరి మధ్య విభేదాలు చెలరేగి, మస్క్ "రిఫార్మ్ పార్టీకి కొత్త నాయకుడు అవసరం. ఫరాగె దానికి తగిన వాడు కాదు" అని 'ఎక్స్' పైన పోస్టు చేశాడు."ఇది ఆశ్చర్యకరం" అని రిఫార్మ్ పార్టీ నాయకుడు వ్యాఖ్యానించాడు. అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ రెండవ సారి పదవీ బాధ్యతలు చేపట్టబోయే జనవరి 20న ఇద్దరూ కలవబోతున్నారు. ప్రపంచ కుబేరుడితో "బంధాలేమైన తెగిపోతే వాటిని చక్కదిద్దాలనుకుంటున్నాను" అని ఫరాగె అన్నాడు.

### ఆందోళన చెందాల్సిన అవసరం ?

ఒకటైతే వాస్తవం. ఎలన్ మస్క్ ఒక దక్పథాన్ని అమ్ముతున్నాడు. టెస్లా, స్టార్ లింక్ వంటి మస్క్ కంపెనీలు ప్రపంచమంతా వ్యాపిస్తున్నాయన్నది వాస్తవం. ప్రయోజనాల్లో విభేదాలున్నాయి. రాజకీయ సంబంధాలను గెలుచుకోవడం ద్వారా తన వ్యాపారాన్ని ఇంకా విస్తరించ దలిచాడా? తన రాజకీయానికి తన వ్యాపార ఆలోచన సహాయపడుతుందా? ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు, సామాజికమాధ్యమాల్లో సింహభాగం కలిగిన వ్యక్తి, ప్రభుత్వాలను శాసించాలని చూస్తున్నాడు. ఈ భయాందోళనలు ఇంకా పూర్తిగా కనిపించడం లేదు. జర్మనీలో హిట్లర్ తరువాత ముందుకు దూసుకొస్తున్న మితవాద పార్టీ ఏఎప్ డీ ఇప్పటికే ప్రాంతీయ ఎన్నికల్లో విజయం సాధించింది. దానికి తోడు దాని నాయకుడు బ్జోర్న్ హాకే తురింజియాలో గెలిచాడు. రాజకీయ కార్యక్రమాల్లో ఉద్దేశ్యపూర్వకంగా నాజీ పార్టీ నినాదాలు చేయడంతో ఇప్పటికే అతనికి రెండు సార్లు శిక్ష పడింది. మస్క్‌ను అనుసరించే వారు 212.4 మిలియన్ల మంది ఉండడం వల్ల, దశల వారిగా, ఆయన అభిప్రాయాలను పోగు చేసే ప్రత్యేకమైన ప్రేక్షకులుగా వారు ఏర్పడి వారొక ఆకర్షణీయంగా తయారు కావచ్చు. నూతన ఆలోచనల్లో భాగంగా ప్రస్తుత యూరోపియన్ ప్రభుత్వాలకు మైలు రాయిగా ఉన్న డిజిటల్ సర్వీస్ చట్టం అనే ఆన్‌లైన్ విధానాన్ని తొలగించకతప్పదని మస్క్ నొక్కి చెపుతున్నాడు. నిబంధనల మేరకు మస్క్ కానీ, 'ఎక్స్' కానీ ఓటర్లను ప్రభావితం చేయడానికి తన ప్లాట్ ఫాంను వినియోగించుకున్నారని యురోపియన్ యూనియన్ దర్యాప్తులో తేలితే వారికి జరిమానా విధించక తప్పదు. బ్రిటన్‌కు సంబంధించి, ఎక్స్' పైన మస్క్ తన వాక్చాతుర్యంతో తప్పుడు ప్రచారాన్ని తీవ్రతరం చేశాడని ఆరోపణ ఉంది. నూతన సంవత్సరం మొదలైనప్పటి నుంచి మస్క్ నిరంతరాయంగా 200 ల వరకు పోస్టింగ్‌లు పెడుతూనే ఉన్నాడు. వాస్తవానికి పాకిస్థాన్ సంతతి బ్రిటన్ వ్యక్తి పదేళ్ళ పిల్లలపైన లైంగిక దాడికి పాల్పడిన నేర సంఘటన అది. ఇదే కాదు, గత జులైలో విజయాన్ని సాధించిన లేబర్ పార్టీ కెయిర్ స్టార్ మర్ ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయడానికి బ్రిటన్‌లో ముస్లిం జనాభాపైన కూడా మస్క్ అనవసరమైన వ్యతిరేకతను రెచ్చకొడుతున్నాడని విమర్శకులంటున్నారు. వలస వ్యతిరేక వైఖరి చేపట్టిన లేబర్ పార్టీ ప్రభుత్వం బ్రిటన్ లో సంస్కరణలను చేపట్టిన విషయం విదితమే.

"ఓట్ల కోసం సమూహిక అత్యాచారాలకు తీవ్రంగా సహకరిస్తున్నాడు" అని స్టార్మర్ మీద మస్క్ ఒక ట్వీట్ లో ఆరోపించాడు. బ్రిటన్‌లో మితవాద కార్యకర్త, ఇస్లాం ద్వేషి, రాజకీయ ఖైదీ అయిన టోమీ రాబిన్సన్ ని జైలు నుంచి విడుదల చేయాలని కోరాడు.

బ్రిటన్ లో గత ఆగస్టులోచెలరేగిన మతకల్లోలాల సందర్భంగా 'ఎక్స్' తన మాటలతో హింసను రెచ్చగొట్టాడు. 'మాట్లాడే స్వేచ్ఛ' కోసమే నిలబడ్డానని చెప్పుకునే మస్క్, అనుమానితులను గుర్తించడం, వారి జాతీయత, మతం, వలస స్థితి వంటి వాటితో హింసను పెంచడానికి ఈ విధంగా తప్పుడు సమాచారాన్ని ఇచ్చాడు.

మస్క్ ట్విట్టర్‌ను చేపట్టినప్పటినుంచి మితవాదుల అకౌంట్ల పైన కూడా మైక్రో బ్లాగింగ్ ప్లాట్ ఫాం పైన భయాందోళనలు, దర్యాప్తులు పునరావృతమవుతున్నాయి. ఒక మిలియన్ మంది అనుసరిచే వారున్నప్పటికీ, అమెరికాలో 14మంది సంప్రదాయ వాదులపైన కూడా సెన్సార్ షిప్ విధించినట్టు ఆరోపణలున్నాయి. తాము 'ఎక్స్' పైన బ్లూ వెరిఫికేషన్ బ్యాడ్జస్‌లతో పాటు నోట్ల విలువను కూడా పోగొట్టుకున్నామని వారి ఆవేదన.

టెక్ ఇండస్ట్రీ గురించి తాను మస్క్‌ను విమర్శించిన రెండు రోజులకే 'ఎక్స్' ట్రంప్ కు సన్నిహితురాలు, మితవాద కార్యకర్త లౌరా లూమర్ ఆర్థిక విలువను తగ్గించేశాడు. "ట్రంప్ అసలైన వలస విధానాలకు మద్దతు తెలిపినందుకు ఎలన్ మస్క్ మౌనందాల్చినట్టు కనిపించాడు" అని ఆమె 'ఎక్స్'కు రాసింది.

### భారత కథ

భారత దేశానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో మోడీ పైన బీబీసీ డాక్యుమెంటరీ వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వానికి మస్క్ సహాయం చేశాడు. మణిపూర్ అంతటా లాక్ డౌన్ విదించినప్పుడు స్టార్ లింక్‌తో అతని ఇంటర్ నెట్ సేవలను వినియోగించాడని ఆరోపణలున్నాయి.

భారతీయ మార్కెట్ లోకి మస్క్ ప్రవేశించడానికి అనుగుణంగా మోడీ ప్రభుత్వంతో ఏళ్ళ తరబడి స్నేహం నెరిపినప్పటికీ అదంత సజావుగా సాగలేదు. ప్రధాని నరేంద్ర మోడీతో తాజాగా 2015లో సమావేశమైనప్పుడు, ఆయన్ని తెస్లా మోటార్స్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించడానికి తీసుకుని వెళ్ళినప్పుడు "ఆయన దృష్టిని అర్థం చేసుకున్నాను" అని చెప్పాడు.

ఐక్యరాజ్య సమితా భద్రతా మండలిలో భారత దేశానికి స్థానం లభించాలని గత ఏడాది జనవరిలో 'ఎక్స్' లో పోస్ట్ చేసిన మస్క్ , ఈ భూమి పైన ఇంత ముఖ్యమైన దేశానికి భద్రతా మండలిలో స్థానం లేకపోవడం 'అసంబద్ధం' అని వ్యాఖ్యానించాడు. రెండు నెలల తరువాత మస్క్ ఈవీ కంపెనీకి తక్కువ టారిఫ్ లభించడమే కాదు, మహరాష్ట్ర, గుజరాత్, తమిళనాడులలో తన ఫ్యాక్టరీలకు స్థలాలను అన్వేషించాడని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో మోడీ గెలిచినందుకు గత ఏడాది జూన్‌లో ఆయన్ని అభినందించాడు. మహరాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల శాసన సభ ఎన్నికల ఫలితాలను ప్రకటించడానికి ఒక రోజు ముందు భారత ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు విధానాన్ని కాలిఫోర్నియాతో పోలుస్తూ కీర్తించాడు.

"భారతదేశం 640 మిలియన్ల ఓట్లను ఒకే రోజులో లెక్కించింది." అని ఎక్స్ లో పోస్ట్ చేశాడు. ఈవీఎంల గురించి మాట్లాడుతూ ఇది చాలా ప్రమాదకరమని వ్యాఖ్యానించగా, రాష్ట్ర ఇన్ఫర్ మేషన్ టెక్నాలజీ శాఖ మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మాత్రం 'ఇది చాలా సులువైంది' అని ప్రకటించారు.

ఆంతరంగిక రాజకీయాల్లో మస్క్ జోక్యం చేసుకుంటున్నాడని, తాను ఎంపిక చేసుకున్న వాటిలో తన పునాదిని ఏర్పాటు చేసుకుంటున్నాడని ఫ్రాన్స్ అధినేత ఎమాన్యెయెల్ మాక్రో, నార్వే ప్రధాని జోనస్ ఘర్ స్టోర్, జర్మన్ ఛాన్స్ లర్ ఓలాఫ్ షోల్జ్ విమర్శించారు.

'మస్క్ అపరమేధావి' అని, డోనాల్డ్ ట్రంప్ తో రాజకీయంగా అతను కలిసి ఉండడం వల్ల అతన్ని 'రాక్షసుడు' అని తప్పుగా చిత్రిస్తున్నారని ఇటలీ అధినేత జార్జి మెలోని అంటాడు. వలసలపైన మెలోని ఖఠిన వైఖరి అనుసరిస్తూ, తన పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఆయన పై చర్య తీసుకున్న ఇటలీ న్యాయవ్యవస్థను మస్క్ విమర్శించాడు.

ప్రపంచంలో మితవాదులు ఆధిపత్యం పెరుగుతున్న సూచనలు కనిపిస్తుండడంతో మస్క్ దాన్ని తనకు అనుకూలంగా మలుచుకుంటున్నాడు.

"అత్యున్నత అధికారం అత్యున్నత బాధ్యతల నుంచే వస్తుంది" అని అంకుల్ బెన్ అంటాడు.

స్వేచ్ఛా ప్రసంగం, పారదర్శకత వంటి నిబద్ధతతోనే మస్క్ కార్యకలాపాలుంటాయని అతని మద్దతుదారులంటుండగా, ఆత్మపరిశీలన లేని అతని వ్యవహారం ప్రజాస్వామిక వ్యవస్థను దెబ్బ తీస్తుందని అతని విరోధులు అంటారు.

**-షర్మితా కార్, అనువాదం : రాఘవ**

(ద వైర్ కోసం)

---

## శివతేజకు "లేఖ అవార్డ్స్" ప్రశంసలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లేఖ అవార్డ్స్ సభ్యులకు ధన్యవాదాలని, శ్రీకాకుళం జిల్లా నుండి సామాజిక సేవలకు గుర్తింపునివ్వడం ఆనందంగా ఉందని, తన పేరును ప్రతిపాదించిన జిల్లా ప్రముఖులకు ప్రత్యేక కృతజ్ఞతలని లేఖ కీర్తిరత్న ప్రశంస గ్రహీత ఉర్లం శివతేజ తెలిపారు. ఈ సందర్భంగా లేఖా అవార్డ్స్ నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీకాకుళం నుండి ఉర్లం శివతేజ చేస్తున్న నిస్వార్థ, నిరంతరసేవల కోసం ప్రముఖులు ప్రతిపాదించటంతో ప్రశంసాపత్రాన్ని అందించామన్నారు. లేఖ వార్షిక అవార్డులు-2024 కార్యక్రమంలో లేఖ కీర్తిరత్నకు నామినేట్ చేయబడిన శివతేజ సేవ, కృషి, విజయాలకు గుర్తింపుగా అందించటం గొప్పగా భావిస్తున్నామన్నారు. తన నిబద్ధత, శ్రేష్ఠత అందరికీ స్ఫూర్తినిచ్చాయన్నారు. ఖచ్చితంగా ఘనంగా సత్కరించే రోజు వస్తుందని, అందుకు తాము కూడా ఎదురు చూస్తున్నామన్నారు. లేఖ ప్రయాణంలో అంతర్భాగంగా ఉన్నందుకు ధన్యవాదాలని, చంద్రబాబు, చీఫ్ ఎడిటర్ వ్యవస్థాపక ప్రచురణకర్త, ఇతర సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాన్ని లైన్స్‌క్లబ్ శ్రీకాకుళం మెంటర్ నటుకుల మోహన్, శివతేజకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తల్లితండ్రులతో పాటు లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డా.బొడ్డేపల్లి సురేష్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, డిసి బి.దేవభూషణ్, సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర, శ్రీకాకుళం జేసీఐ మెయిన్ సభ్యులు, మానవత స్వచ్ఛంద సంస్థ శ్రీకాకుళం, ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, శాశపు జోగినాయుడు, పత్రిక ప్రతినిధులు, నగర ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, మిత్రులు అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డా.ఎం.కె.మిశ్రో, ఈనాడు ఈశ్వరరావు, పొడుగు చరణ్, డా.పైడి ప్రదీప్, సి.హెచ్.గణపతిలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను అభినందించిన పాలకొండ రోడ్డు వర్తకులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో పాలకొండరోడ్డులో చేస్తున్న అభివృద్ధి పనులపై ఆ మార్గంలో ఉన్న వర్తకులు పెద్దసంఖ్యలో ఆదివారం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వర్తకులు తమ అభిప్రాయాలను ఎమ్మెల్యేకు తెలిపారు. శాసనసభ్యునికి తెలియజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శాసనసభ్యులు అందరి ఆమోదంతో మరింత ఆహ్లాదకరంగా తయారుచేసేందుకు కృషి చేద్దామన్నారు. కొందరు వర్తకులు సెంటర్‌పార్కింగ్ పెడితే బాగుంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు నిబంధనల ప్రకారం సెంటర్ పార్కింగ్ అందరికీ ఆమోదయోగ్యంగా తయారుచేసి, మరింత తేజవంతమైన విద్యుత్ దీపాలతో అభివృద్ధి చేద్దామన్నారు. పాలకొండ రోడ్డు వర్తకులు శ్రీకాకుళం శాసనసభ్యులు శంకర్‌ను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ ప్రముఖులు వివిధ రంగాల వర్తక వాణిజ్య వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

### ఖోఖో ప్రపంచకప్ విజేతలకు అభినందనలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఖోఖో ప్రపంచకప్ విజేతలుగా భారత్ నిలవటం హర్షణీయమని, శ్రీకాకుళ జిల్లా ఖోఖో చైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో తొలుత మహిళల జట్టు 78-40పాయింట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేయగా, ఆ తర్వాత పురుషుల జట్టు కూడా 54-36పాయింట్ల తేడాతో నేపాల్ జట్టునే మట్టి కరిపించి టైటిల్‌ను చేజిక్కించుకొని జగజ్జేతగా నిలవటం హర్షణీయమన్నారు. ప్రియాంక ఇంగ్లే నేతృత్వంలో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచిందన్నారు. మొదటి నుండి విజయమే ధ్యేయంగా, సమిష్టి కృషితో నేపాల్‌కు అవకాశం ఇవ్వకుండా భారత్ తన ఆధిపత్యాన్ని చలాయించి ప్రపంచకప్ ముద్దాడిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిట్టి నాగభూషణం, ఖోఖో జిల్లా టీమ్ సభ్యులు పాల్గొన్నారు



## శశాంకవిజయం శృంగార వీరరసాల దర్పణం



(సత్యంన్యూస్, రాజాం)

దక్షిణాదికి చెందిన శేషం వెంకటపతి రచించిన 'శశాంక విజయం 'ప్రబంధం శృంగార వీర రసాలతో కూడి ఉందని ప్రముఖ సాహితీ ప్రముఖులు ఒమ్మి రమణమూర్తి పేర్కొన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం జరిగిన రాజాం రచయితల వేదిక దశమ వార్షికోత్సవం సభలో ఆయన 'శశాంకం విజయం కావ్యసౌరభం ' అనే అంశంపై మాట్లాడారు. తారాచంద్రుల కథ ఆధారంగా దంపతుల మధ్య వయోభేదం హెచ్చుగా ఉన్నప్పుడు జరగబోయే ప్రమాదాలను శృంగారస ప్రధానంగా శేషం వెంకటపతి రచించారని ఆయన చెప్పారు. అనంతరం వేదిక సభ్యులు ఒమ్మి రమణమూర్తిని సన్మానించారు. నేతేటి గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గార రంగనాథం, రౌతు గణపతిరావునాయుడు, పిల్లా తిరుపతిరావు, పెంకి దయానిధి నాయుడు, ఆల్తి మోహనరావు, సమతం మహేశ్వరరావు, పొట్నూరు కోటిబాబు, మూడడ్ల శ్రీనివాసరావు, రాజాపు శాంతారావు, శాసపు సత్యనారాయణ, ఉరిటి గున్నేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, కుదమ తిరుమలరావు, ముదిలి శంకర్రావు, ఉరిటి రామలింగేశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ తదితరులు హాజరయ్యారు.


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# వీజీకే కుటుంబానికి ధర్మాన పరామర్శ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


శ్రీకాకుళం జిల్లా సిపిఎం సీనియర్ నేత వీజీకే మూర్తి గురువారం మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం పరామర్శించారు. కత్తెర వీధిలోని ఆయన నివాసానికి ధర్మాన చేరుకొని మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ మూర్తి విలువలు గల వ్యక్తి అని, కార్మికుల తరపున జరిగిన పోరాటాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. వీజీకే మూర్తి కళ్లు దానం చేయడమే కాకుండా దేహాన్ని రిమ్స్‌కు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. మూర్తి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



# బాత్రూమ్‌లో శవం.. బెడ్‌రూమ్‌లో లవర్

(మొదటిపేజీ తరువాయి)

రూ.40వేలు తీసుకున్న అప్పు తీర్చినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా ఆదివారం సాయంత్రం బైపాస్ జంక్షన్ వద్ద దాబాకు వెళ్దామని నరేంద్రను తీసుకువెళుతున్న తోవలోనే కళావతిని హత్య చేశానని నరేంద్రకు శరత్ చెప్పినట్లు భోగట్టా. దీన్ని మొదట నమ్మని నరేంద్ర అందుకు సంబంధించిన ఆధారాలు కూడా శరత్ చూపించడంతో అక్కడికక్కడే బండిని నిలుపుదల చేసి టూటౌన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్‌కు ఫోన్‌చేసి శరత్‌ను అప్పగించినట్లు తెలుస్తుంది. మరోవైపు అప్పటికే ఈ విషయం పోలీసులకు ఉప్పందడంతో శరత్ కోసం వెతుకులాట మొదలుపెట్టారు. అదే సమయంలో టూటౌన్ కానిస్టేబుల్‌కు సమాచారం రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం కళావతిని హత్య చేసి, ఆ బాడీని బాత్రూమ్‌లోకి తరలించి మరో అమ్మాయితో శనివారం రాత్రంతా గడిపిన శరత్ ఒక్కడే ఈ హత్యకు పాల్పడ్డాడా? లేదూ అంటే ఆయన మిత్రులు ఉన్నారా? అన్న కోణంలో దర్యాప్తు జరుగుతుంది. పోలీస్ ఇంటరాగేషన్‌లో మాత్రం తానొక్కడినే హత్య చేసినట్లు శరత్ చెబుతున్నాడని తెలుస్తుంది. కానీ పోలీసులు మాత్రం నరేంద్ర, ఉమ అనే ఇద్దర్ని కూడా అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు భోగట్టా. జనరేటర్లకు రీకండిషన్ చేసి అమ్మడం ద్వారా మూడు తరాలుగా శరత్ కుటుంబం బాగా సంపాదించింది. అయినా కొడుకు స్థిరం కాకపోవడంతో వెంకట్రావు బయటకు పంపించేశారు. ఇదిలా ఉండగా ఘటనా స్థలాన్ని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, డీఎస్పీ వివేకానందలు సోమవారం ఉదయం పరిశీలించారు. బాత్రూమ్‌లో పడివున్న కళావతి మృతదేహం వద్ద క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. ఆమె శరత్ రూమ్‌లోకి వచ్చేసరికి వంటిపై నగలు ఉన్నాయా లేవా? అన్నది దగ్గరలో ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారం ప్రకారం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నగరంలో ఉన్న టైలర్ దగ్గర్నుంచి బట్టలు తీసుకోడానికి వెళ్తున్నానని చెప్పిన కళావతి న్యూకాలనీలో ఓ ప్రైవేటు కళాశాల వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి శరత్ గది వైపు మధ్యాహ్నం 2.40 గంటలకు వెళ్లడాన్ని సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించారు. నగరంలో సంచలనం సృష్టించిన ఈ మర్డర్ కేసును పోలీసులు ఛాలెంజింగ్‌గా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


శరత్ సొంత భవనాలు


సరస్వతి మహల్ ఎదురుగా శరత్ జనరేటర్ షాపు

## మూగజీవాలకు వైద్యం అవసరం: బగ్గు



(సత్యంన్యూస్, నరసన్నపేట)

మూగ జీవులైన పశువులకు వైద్యం అవసరమని గుర్తించి పశువైద్యశాలలు లేని గ్రామాల్లో ప్రత్యేక పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. పోలాకి మండలం మబగాం గ్రామంలో పశుసంవర్ధక ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. పాడి పశువుల వలన నిత్యం ఆదాయం ఉంటుందని, పశువులకు వైద్యం అందించే నిమిత్తం ఈ ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసిందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. నట్టలనివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని, చికిత్సతో పాటు వాటికి కావలసిన మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ప్రసాద్, పశుసంవర్ధక సహాయకులు, గ్రామ పశుసహాయకులు, గోపాలమిత్రలు, వైద్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాడిరైతులు పాల్గొన్నారు.

## 25న ధనుర్మాస అన్నసంతర్పణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 25న శనివారం కొన్నవీధి భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు భీమేశ్వర భజన బృందం ప్రతినిధులు బలగ మన్మధరావు, సొంగలి గణేష్, గడిదేశి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గత 26 ఏళ్లుగా ధనుర్మాసంలో మేలుకొలుపులు కార్యక్రమం నిర్వహించడంతో పాటు పండగ నాడు ఏకాహం (24 గంటలు అఖండ భజన) ఏర్పాటుచేస్తున్నారు. అలాగే ఏటా పండగ అనంతరం భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నారు. మేలుకొలుపులు ప్రారంభించి ఈ ఏడాదితో 26 ఏళ్లు పూర్తయ్యాయని, ఎప్పటిలానే అన్నసంతర్పణ కార్యక్రమం ఈ శనివారం ఏకాదశి పర్వదినాన ఏర్పాటు చేస్తున్నామని వారు ఆ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

## వితంతు పింఛన్లు మంజూరుచేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తమకు వితంతు పింఛన్లు మంజూరుచేయాలని పేడాడ కృష్ణవేణి, కరగాన నీలమ్మ, హనుమంతు ఈశ్వరమ్మ, వడిస లక్ష్మి గ్రీవెన్స్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నలుగురి వితంతు పెన్షన్లు దరఖాస్తు చేయగా, పెన్షన్ ఐడి క్రియేట్ అయి కూడా ఇంతవరకు పెన్షన్లు రాలేదు. దీంతో సోమవారం గ్రీవెన్స్‌లో వైకాపా జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తితో కలిసి వెళ్లి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం జిల్లా అధ్యక్షుడుగా నామినేషన్ పత్రాలను పార్టీ నియమించిన జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాధరాజు, పార్టీ పరిశీలకులు సుహాసిని ఆనంద్‌లకు అందజేశారు. 21న విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో అధికార పూర్వకం జిల్లా అధ్యక్షుడు ప్రకటన ఉంటుందని ఎన్నికల అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



## కుమ్మరిపేట పాఠశాల అభివృద్ధికి చర్యలు



(సత్యంన్యూస్, గార)

కుమ్మరిపేట ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సోమవారం కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి తక్షణం చేయవలసిన పనులను పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక టీడీపీ నాయకులతో చర్చించారు. పాఠశాలకు ప్రధానంగా తాగునీటి సదుపాయం కల్పించడానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహకారంతో కృషి చేస్తామని, విద్యార్థుల రక్షణకు ప్రహరీ గోడ నిర్మించవలసిన అవసరం ఉందని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తక్షణం ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక టీడీపీ నాయకులు, గార ఎస్ఐ పాల్గొన్నారు

## గ్రంథాలయాల అభివృద్ధే ఎర్రన్న విద్యాసంకల్పం లక్ష్యం

- ఎమ్మెల్యే గొండు శంకర్
- గ్రంథాలయానికి పోటీపరీక్షల పుస్తకాల బీరువా అందజేత

(సత్యంన్యూస్, గార)

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు సహాయ సహకారాలు అందించేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహకారంతో ఎర్రన్న విద్యాసంకల్పం పేరున వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో సహా ఒక బీరువాను సోమవారం గార శాఖా గ్రంథాలయానికి ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ అన్ని పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను పొందుపర్చి ఎర్రన్న విద్యాసంకల్పం బీరువాను గార గ్రంథాలయానికి అందజేశామని, ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని నిరుద్యోగులు పోటీపరీక్షల్లో ఉత్తీర్ణత పొంది ప్రయోజకులు అవ్వాలని ఆకాంక్షించారు. దివంగత నేత స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు ఆశయ సాధనలో ఎర్రన్న విద్యాసంకల్పం కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను సమకూర్చిన కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, గార మండల టీడీపీ నాయకులు, గ్రంథాలయం అధికారులు, స్థానిక ప్రజలు, మండల అధికారులు, నిరుద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు




## పేదలకు అండగా నిలుద్దాం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)


అధికార తెలుగుదేశం పార్టీ చేస్తున్న అరాచకాలను సమష్టిగా ఎదిరించి పేదలకు అండగా నిలుద్దామని వైకాపా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. చింతలపేట పంచాయతీ చింతలపేట, దండెంవలస గ్రామాల్లో వైకాపా కార్యకర్తలందరిని కలుసుకొని కూటమి ప్రభుత్వం చేస్తున్న పెన్షన్ల తొలగింపు, సచివాలయాన్ని తరలించడం, రోడ్లు కాలువలు నిర్మాణంలో లోపాలు తదితర విషయాలపై కార్యకర్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బొబ్బిలిపేట మాజీ సర్పంచ్ చింతాడ చలపతిరావు, పేడాడ శశిభూషణ్, బాల సుందర్, కంచు శ్రీరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.












# కోటేశ్వరరావు నేత్రాలు సజీవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కుశాలపురం (వెంకటాపురం)లో నివాసం ఉంటున్న పేడాడ కోటేశ్వరరావు (85) సోమవారం మృతిచెందారు. వారి నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకుని కుమారుడు పి.లక్మణరావు, కుమార్తెలు పి.లక్ష్మి, బి.రాజేశ్వరి రెడ్‌క్రాస్ ప్రతినిధి నారా హర్షవర్ధన్, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు తెలిపారు. దీంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ–టెక్నీషియన్ పూతి సుజాత, సహాయకులు నంది ఉమాశంకర్ ద్వారా అతని కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందజేశారు. కోటేశ్వరరావు మృతికి సంతాపం తెలియజేస్తూ దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానంపై అవగాహన, చైతన్యం ప్రజల్లో బాగా పెరుగుతుందని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలని అన్నారు. నేత్రదానం చేయాలనుకునేవాళ్లు 78426 99321 నెంబరుకు కాల్ చేయాలని కోరారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.